అన్నదాతలకు అండగా రైతు భరోసా కేంద్రాలు

- విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు వెన్నుదన్ను
- సీసీఆర్ పత్రాల పంపిణీ



భీమడోలులో సీసీఆర్ పత్రాలను అందిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. విత్తనంనుంచి విక్రయం వరకు రైతున్నల వెన్నంటే ఉండి వారికి ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. గత ప్రభుత్వాల హయాంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు ఈ ప్రభుత్వం సమస్యల తలెత్తకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరిస్తోంది. వారికి అందుబాటులో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సాగులో వారికి మెలకువలు నేర్పుతున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా వారికి యాజమాన్య పద్ధతులపై శిక్షణ అందిస్తున్నారు. ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, రైతుల ముంగిటకే వచ్చి చేరుతున్నాయి. నిత్యం రైతులకు సాయం చేస్తూ విప్లవాత్మక మార్పులకు ఆర్బీకే కేంద్రాలు శ్రీకారం చుట్టి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

రైతుల చెంతకే ప్రభుత్వ సేవలు

గత ప్రభుత్వాల హయాంలో రైతులకు ఏ పని చేయించుకోవాలన్నా మండల కేంద్రానికి పరిమితమైన వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, పశు సంవర్థక సేవలు ఈ ప్రభుత్వంలో ఆర్బీకేల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు చేరువైంది. రైతులకు సాంకేతిక బదలాయింపు, దిగుబడుల నాణ్యత, అధునిక పరికరాల వినియోగం, రాయితీపై ఎరువులు, విత్తనాలు, రసాయన రహిత సేద్యం, రాయితీ పరికరాలు వైఎస్సార్ బీమా వంటి అనేక కార్యక్రమాల ద్వారా వారికి చేదోడు వాదోడుగా నిలిచింది.

సీసీఆర్ పత్రాల పంపిణీ

మండలం	సీసీఆర్ కార్డులు	శాతం
భీమడోలు	3,620	84శాతం
ద్వారకాతిరుమల	2,400	85శాతం
ఉంగుటూరు	4,500	87శాతం
నిడమర్రు	1,250	98శాతం

ప్రస్తుత సార్వా సీజన్‌లో తగిన పంటల సాగు, దుక్కి తయారీ, విత్తనాలు ఎంపిక సమగ్ర సస్య రక్షణ, నూర్పిడి వంటి అంశాలపై డిజిటల్ గ్రంథాలయాలు, ముద్రిత సమాచారాన్ని ఆర్బీకేలు కేంద్రాలుగా నిలిచాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకునేలా ఎప్పటికప్పుడు ఆర్బీకే సహాయకుల ద్వారా శిక్షణ అందుకుంటున్నారు. వ్యవసాయ సాగు సలహా మండలి ఏర్పాటుతో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విత్తనాలు, పరికరాలు ఆర్బీకేల్లో సమకూర్చుతున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సంయుక్త కార్యదర్శి ఆర్బీకేల ద్వారా రైతులకు అందుతున్న సేవలపై ప్రశంసల జల్లు కురిపించారు. ఉత్తమ పనితీరుతో బహుళ ప్రయోజనాలు కేంద్రాలు మన రైతుల మన్ననలతో పాటు ఇతర రాష్ట్రాలు, దేశా రైతుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. రాష్ట్రంలోని అమలవుతున్న ఆర్బీకేల అధ్యయనం చేసిన కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఇక్కడ కూడా ఏర్పాటుకు సమయత్తమవుతున్నాయి.

రైతులకు యంత్ర పరికరాలు

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు లక్షల విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. గ్రామస్థాయిలో ఆరుగురికి తక్కువ కాకుండా రైతులంతా ఓ గ్రూపుగా ఏర్పడి వాటిని పొందేందుకు అర్హులు. ఎస్సీ, ఎస్టీల వర్గాల రైతులకు కనీసం ఏకరం వరి పొలం, బీసీ, ఓసీ రైతులకు కనీసం రెండున్నర ఎకరాల భూమి ఉండాలి. అలాంటి వారికి రూ.15లక్షల రుణ సదుపాయం కల్పించి వారికి వ్యవసాయ యంత్ర పరికరాలను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. రైతుల వాటాగా 10 శాతం, సహకార బ్యాంకు రుణంగా 50 శాతం, ప్రభుత్వం రూ.40 శాతం రాయితీగా ప్రభుత్వం అందిస్తోంది.

సీసీఆర్ పత్రాల అందజేత

కౌలు రైతులకు అన్ని విధాలుగా ప్రయోజనాలందించే పంట సాగు హక్కు పత్రాలను అందిస్తున్నారు. ఈ పత్రాల ద్వారా కౌలు వ్యవసాయం చేసే రైతులకు అనేక విధాలుగా లబ్ధి చేకూరుతోంది. 11 నెలల కాల పరిమితికి పంట సాగు హక్కు పత్రాన్ని అందిస్తుంది.

పంట సాగు హక్కు పత్రాలు పొందాలి



కౌలుదారులకు ప్రయోజనాలు చేకూర్చే పంట సాగు హక్కు పత్రాలను అందిస్తున్నాం. తద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, పథకాల లబ్ధి పొందేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. వైఎస్సార్ పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పొందేందుకు, వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందిస్తుంది. సీసీఆర్ పత్రాలను పొందేందుకు కౌలుదారుడు వీఆర్వో, వీఏఏను సంప్రదించి అందులకు అవసరమైన డాక్యుమెంట్లను అందించాల్సి ఉంది. తప్పనిసరిగా భూ యాజమాని అంగీకార సంతకం చేయించి సమర్పించాలి. ఉంగుటూరు నియోజవర్గంలో 11,770 సీసీఆర్ కార్డులను అందించి 85 శాతం సాధించాం.

– డాక్టర్ పి.ఉషారాజకుమారి, ఏడీఏ, భీమడోలు

క్లుప్తంగా

ఎమ్మెల్యే వాసుబాబును కలిసిన ఎస్సై శ్రీను



బువ్వనపల్లిలో ఎమ్మెల్యే వాసుబాబుకు మొక్క అందిస్తున్న నిడమర్రు ఎస్సై శ్రీను

నిడమర్రు: నిడమర్రు పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్సై రమవరపు శ్రీను ఆదివారం బువ్వనపల్లిలోని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నివాసంలో మర్యాద పూరకంగా కలిసి మొక్క అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఎస్సైతో మాట్లాడుతూ బువ్వనపల్లి – బావాయిపాలెం కూడలిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం, మండలంలో శాంతి భద్రతలను పూర్తిస్థాయిలో పరిరక్షించేలా కృషి చేయాలన్నారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష సభలు

పెదవేగి : మండలంలోని రెండు గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని పెదవేగి తహసీల్దార్ ఎస్ నాగరాజు చెప్పారు. జగన్నాథపురం, నడిపల్లిలో తాహసీల్దార్ బృందం, ఎంపీడీఓ రెండు బృందాలుగా పాల్గొననున్న ఈ కార్యక్రమాల్లో 11 రకాల ధృవపత్రాలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులకు మంజూరు చేస్తారని పేర్కొన్నారు.

నేడు దెందులూరులో జగనన్న సురక్ష

దెందులూరు: దెందులూరులో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పోకల రాంబాబు తెలిపారు. అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. దెందులూరు పంచాయతీ, శివారు గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రహదారి నిర్మాణం పరిశీలన



కలపర్రులో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఎంసీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్

పెదపాడు: కలపర్రులో నిర్మిస్తున్న సీసీ రహదారులు నిర్మాణాన్ని ఏఎంసీ అధ్యక్షుడు అప్పన కనకదుర్గాప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఇటీవల గడపగడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కేటాయించిన జేజేఎం నిధులు రూ.20 లక్షల నిధులతో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు రహదారి నిర్మాణం చేపట్టారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రోడ్డును నిర్మించాలని అధికారులకు సూచించారు. కలపర్రు గ్రామ నాయకులు వట్రపు కోటిరెడ్డి, బోధవరపు వెంకటేశ్వరరెడ్డి ఎంపీటీసీ కంభాల నాగరాజు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ప్రతి ఒక్కరూ కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని, కంటి చూపుకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలని లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు సూచించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఉషా గ్రూప్ సంస్థల అధినేత వీవీ బాలకృష్ణా రావు సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రవైద్య శాలకు చెందిన వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా 176 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో 15 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. మరో 26 మందికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోలిశెట్టి సురేష్ కుమార్, అల్లం వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

చింతాలమ్మకు జలాభిషేకం

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం గ్రామ దేవత చింతాలమ్మ అమ్మవారికి ఆదివారం జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళా భక్తులు పారాణి, పసుపు నీళ్లు, వేప ఆకులను కలిపిన జలాలను అమ్మవారి మూల విరాట్ విగ్రహంతో పాటు, కలశానికి పోస్తూ చింతాలమ్మ శరణుఘోష చేశారు.

గిరిప్రదక్షిణ రోడ్డులో ఖర్జూరం మొక్కలు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి ఆలయ గిరి ప్రదక్షిణ రోడ్డులో ఖర్జూరం మొక్కలు ఆదివారం నాటారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దండు ధనరాజు మాట్లాడుతూ కమిటీ ఆర్థిక సహకారంతో 190 ఖర్జూరపు మొక్కలు కొనుగోలు చేశామన్నారు. వీటిని గిరిప్రదక్షిణ రోడ్డులో నాటుతున్నట్లు తెలిపారు. తొలి మొక్కను ఆలయ ఈవో మానికల రాంబాబు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించగా, ది మోటార్ ఫీల్డ్ వర్కర్స్ ఓనర్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది.

ఉత్తమ సేవలందించేందుకు ‘మానవత’ కృషి



భీమడోలులో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఆర్.గంగాధరరావు, జిల్లా, రాష్ట్రస్థాయి ప్రతినిధులు

భీమడోలు: ఉమ్మడి జిల్లాలోని మానవత స్వచ్ఛంద సంస్థలోని కమిటీలన్నీ సమన్వయంతో పని చేసి ప్రజలకు ఉత్తమ సేవలందించేందుకు కృషి చేయాలని ఉమ్మడి జిల్లాల కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ అలపాటి నాగేశ్వరరావు అన్నారు. భీమడోలులో ఆదివారం జిల్లా కేంద్ర నియంత్రణ కమిటీ, జిల్లా కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రీజయన్లల్లోని 14 మండలాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులకు ఒక రోజు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ బలోపేతానికి మనమంతా ఐక్యతతో పని చేయాలని, కమిటీల్లోని కీలకమైన పదవుల్లో ఉన్న వారంతా తమ విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. ఆగస్టులో నిర్వహించే శాంతి ర్యాలీ మహోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ సంస్థకు సభ్యత్వాలే ప్రాణమని, ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యులు చేయాలన్నారు. జూలై నెలాఖరుటి నాటికి సభ్యత్వాలను నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి మాట్లాడుతూ జిల్లాలో కెరీర్ గైడెన్స్ కమిటీ ద్వారా 60 పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. తొలుత ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆత్మీయ సహకారం చైర్మన్ సాగిరాజు జానకిరామరాజు, మాజీ అధ్యక్షుడు అప్పక రాంబాబు, జిల్లాలోని 80 మంది సభ్యులు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో ఆర్జిత కల్యాణోత్సవం

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహించారు. విజయవాడకు చెందిన గన్నవరపు శ్రీనివాస్, మాధవి దంపతులు ఆర్జిత కళ్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించుకున్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపములో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.

పారిజాతగిరికి లక్ష విరాళం

కొయ్యలగూడెం : జంగారెడ్డిగూడెం పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి రూ. లక్ష విరాళం అందజేసినట్లు కొయ్యలగూడెం పీఏసీఎస్ అధ్యక్షులు మంతెన సోమరాజు పేర్కొన్నారు. ఆదివారం దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులను కలుసుకుని లక్ష రూపాయలను అందజేసినట్లు ఆయన తెలిపారు.

నంది అవార్డుల ప్రకటనపై హర్షం



ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలరావుతో నాటకరంగ కళాపరిషత్ సభ్యులు

కొయ్యలగూడెం : రంగస్థలానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా ప్రభుత్వంచే నంది అవార్డు ప్రకటన నాటక రంగ కళాకారులకు ఊపిరులు ఊదినట్లు అయ్యిందని నాటక రంగ కళాపరిషత్ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం తాడేపల్లిలోని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలరావు కార్యాలయంలో కలుసుకుని ప్రభుత్వానికి నాటక కళాకారుల తరుపున కృతజ్ఞతలు తెలిపి సత్కరించినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఐదు నాటిక పోటీలతో పాటు మొత్తం 73 నంది అవార్డులను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఏపీఎఫ్‌డీసీ ఛైర్మన్ పోసాని కృష్ణ మురళి ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఉపముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నామన్నారు. కనుమరుగవుతున్న పద్య, సాంఘిక, నాటకాల పూర్వ వైభవానికి ప్రభుత్వం కృషిచేయడం హర్షణీయం అని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తెలిపారు. నాటక రంగ నంది అవార్డు గ్రహీతలు ఎంపీ రాజర్షి, నాగభట్ల రఘు, ఉమా శంకర్, లోవ రాజు, మణికంఠ ఆర్ట్స్ పిఠాపురం సమాజం, కొండేవరం కళాపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత



దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ సైకిళ్లను అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలులో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కోడూరుపాడు, పోలసానిపల్లి, గుండుగొలను గ్రామాల్లోని ముగ్గురు దివ్యాంగులకు మంజూరైన మూడు చక్రాల మోటార్ సైకిళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సమావేశానికి సర్పంచ్ పాము సునీ తామస్‌సింగ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించేందుకు అవసరమైన వసతులను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ఎం.జాన్సనస్, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, తహసీల్దార్ ఎం.ఇందిరా గాంధీ, , మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి ఎస్.ఠాగూర్, సర్పంచులు షేక్ రహీమాబేగం హసేనా, మానుకొండ నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు సొసైటీ డైరెక్టర్లు సవలం నాని, కిలపర్తి భాస్కరరావు, నాయకులు సుతాపల్లి ప్రసాద్, చెరుకూరి మధు, చిలపర్తి రామారాయుడు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జన నిలయాలు గ్రంథాలయాలు

భీమడోలు: గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలని వక్తలు కొనియాడారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పుస్తక పఠనం చేసారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యం వహించారు. ఈ కార్యక్రమంలో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు కడగల సత్యనారాయణ, పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగు పనుల్లో రైతన్నలు నిమగ్నం

- విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- నియోజకవర్గం పరిధిలో 21,105 హెక్టార్లలో వరి సాగవుతుందని అంచనా



పొలంలో నారుమడిని నాటుతున్న కూలీలు



ముందూరులో నారు వేసిన దృశ్యం

పెదవేగి : కొద్ది రోజులుగా వర్షాలు కురవడంతో ఖరీఫ్ వరి సాగు చేసే రైతులు నారుమడులు పోసే పనుల్లో నిమగ్నమయ్యారు. పెదవేగి పరిధిలో ఈ ఏడాది 3,105 హెక్టార్లలో వరి సాగవుతుంటే, ప్రస్తుతం 100 హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయి. దెందులూరు మండలంలో 7,500 హెక్టార్లలో వరి సాగవుతుందని అంచనా, నేటికి 371 హెక్టార్లలో నాట్లు వేశారు. పెదపాడు మండలంలో 7వేల హెక్టార్లలో ఖరీఫ్ సాగవుతుండగా ఇప్పటికి 333 హెక్టార్లలో నాట్లు వేశారు. ఏలూరు రూరల్ మండలంలో 3,500 హెక్టార్లలో వరి సాగవుతుండగా, ప్రస్తుతం 152 హెక్టార్లలో నారుమడులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఎకరం విస్తీర్ణం భూమికి అవసరమైన నారు కోసం రైతులు 5 సెంట్ల విస్తీర్ణంలో నారుమడి సిద్ధం చేస్తున్నారు. జూన్‌లో సాధారణ వర్షపాతం 122.4 మిల్లీమీటర్లు నమోదువాల్సి ఉండగా, 221 మిల్లీమీటర్లు నమోదైంది. ఈ ప్రాంతంలో 1061, 1121, బీపీటీ 5104, పీఎల్ 1100, ఎంటీయూ 7029, వరి విత్తనాలను సాగుకు వినియోగిస్తున్నారు.

జింక్, ఐరన్ లోప నివారణ చర్యలు తీసుకోవాలి

వరి నారుమడి పోసిన తర్వాత 15 రోజుల్లో జింక్, ఐరన్ లోప నివారణ చర్యలు తీసుకోవాలి. దీనికోసం రెండు శాతం జింక్ సల్ఫేట్, అన్నభేది నిమ్మ ఉప్పును పిచికారీ చేయాలి. నారుమడిలో నీరు పెట్టడానికి, తొలగించడానికి అనువుగా కాల్వలు ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

వరి నారుమడులు పోసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలి. దీనివల్ల పంటకు అగ్గితెగులు సోకే అవకాశం ఉండదు. ఒక లీటరు నీటిలో 5 గ్రాముల ట్రైకోకడెర్మా విర్డిని లేదా సుడోమోనార్క్‌ను కలిపి విత్తన శుద్ధి చేయాలని ఏఓ డి రాధిక తెలిపారు.

విత్తనాలను మొలక కట్టాలి

వరి విత్తనాలను చల్లే ముందుగా మొలక కట్టి మొలక శాతం పరీక్షించాల్సి ఉంది. లేని పక్షంలో రైతులు నష్టపోయే అవకాశం ఉంది. ఎకరానికి అవసరమైన నారు కోసం 5 సెంట్ల భూమిలో 20 నుంచి 25 కేజీల విత్తనాలను చల్లుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

25 రోజుల తర్వాతే నాటాలి

నారుపోసిన 25 రోజుల తర్వాతనే నారు తీసి నాటు వేసుకోవాలి. కాండం తొలుచు పురుగు, ఆకు తొలుచు పురుగు నివారణ కోసం నాట్లు వేసేందుకు నారు తీసే ముందు మడిలో సెంటు ఒక్కింటికీ 200 గ్రాములు చొప్పున కార్బోప్యూరాన్ 3జి గుళికలను చల్లాలి.

– ఎం ప్రియాంక, వ్యవసాయశాఖాధికారిణి, పెదవేగి

వలంటీర్లు విశేష సేవలందిస్తున్నారు



భీమడోలు: వలంటీర్లు మా బిడ్డలలాగా సేవలందిస్తూ సంక్షేమ పథకాలను మా చెంతకు తీసుకొస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందాలంటే ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి నాది. నాకు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. వారికి పెళ్లిళ్లు కావడంతో వెళ్లిపోయారు. నేను ఒంటరిగా జీవిస్తున్నాను. నాకు పథకాలు పొందే అర్హత ఉన్నా గత ప్రభుత్వంలో అందలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్లు అన్ని విధాలుగా అండగా నిలిచారు. మా క్లస్టర్ వలంటీర్ కఠారి మోహన్ ఇంటి వద్దకే వచ్చి అర్హత ఉన్న పథకాలకు దరఖాస్తు చేయించాడు. నా బిడ్డ మాదిరిగా నాకు అన్ని సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా కృషి చేశాడు. పింఛన్ ప్రతి నెల రూ.2,750, కాపు నేస్తం పథకంలో రూ.15వేలు, రూ.లక్షల విలువ చేసే జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరయ్యాయి. మాలాంటి పేదలకు సేవలందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థపై విమర్శలు సరికాదు.

– పసుపులేటి చిట్టి లక్ష్మి, ఒంటరి మహిళ, భీమడోలు

వలంటీర్లకు సంపూర్ణ మద్దతు



దెందులూరు: సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లకు నా సంపూర్ణ మద్దతు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వారు ప్రజలకు చేరువ చేస్తున్నారు. కరోనాలో సమయంలో దేశ వ్యాప్తంగా అందరి ప్రశంసలు పొందేలా విధులు నిర్వర్తించిన వలంటీర్లను ఎవరు విమర్శించినా, కించపరిచినా సహించేది లేదు. కులం పునాదులు మీద రాజకీయాలు నిలబడలేవు. వలంటీర్లను, దళితులను విమర్శించినా, కించపరిచినా రేషన్‌డీలర్ల తరపున పోరాటం చేస్తాం.

– తలారి రామకృష్ణ, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యులు

కాపునేస్తం పథకానికి దరఖాస్తులు

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో కాపునేస్తం పథకం మంజూరుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నేత పోకల రాంబాబు అన్నారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో కాపునేస్తం పథకంలో కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన అర్హులైన ప్రతి మహిళ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న కాపు నేస్తంలో ఇస్తున్న రూ.15 వేలు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో అన్ని గ్రామాల్లో కాపు సంఘం నేతలు, కాపు యువతతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులందరూ వైఎస్సార్ కాపునేస్తం పథకానికి అర్హులందరూ దరఖాస్తులు చేసుకునేలా తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాపు, బలిజ, ఒంటరి, తెలగ, కులాలకు చెందిన మహిళలకు ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి కల్పించడం ద్వారా జీవన విధానం మెరుగుపరిచి శాశ్వత భద్రత కల్పించే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాపునేస్తం పథకాన్ని అమలు చేన్నారని పోకల రాంబాబు అన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరుపై హర్షం

దెందులూరు: జోగన్నపాలెంలో శ్మశానం అభివృద్ధికి రూ. 5 లక్షలు, రోడ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిట్టా గాంధీ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం జోగన్నపాలెంలో వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో మలుపు వంతెన, ఎస్సీ కాలనీలో రోడ్డు నిర్మాణం, రైతులకు గ్రావెల్ రోడ్డు, ఎస్సీ, బీసీ ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్మాణం, గ్రామంలో వాటర్ పైపులైన్ మార్పునకు వెంటనే అధికారులతో అంచనాలు రూపొందించి కార్యాలయానికి తీసుకు రావాలని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆదేశించడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయం ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మరికొన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకు హామీ ఇవ్వడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు.

మండలానికి సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు

దెందులూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 13,203 సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు వచ్చాయని మండల విద్యాశాఖాధికారి ఎ.ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 1 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు ఎంఈఓ కార్యాలయానికి చేరాయని తెలిపారు. రెండు రోజుల్లో పౌరసరఫరాల శాఖ వాహనాల ద్వారా ద్వారా నేరుగా పుస్తకాలను పాఠశాలలకు తీసుకువెళ్లి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సమక్షంలో విద్యార్థులకు అందజేస్తామని ఎంఈఓ ప్రసాద్ తెలిపారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



గంజాయి కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏలూరు త్రీటౌన్ సీఐ శివాజీ

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో గంజాయి రవాణా, విక్రయాలు చేస్తే తాట తీస్తానని ఏలూరు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ హెచ్చరించారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిత్యం గంజాయి విక్రయాలు, రవాణాపై నిఘా ఉంటుందన్నారు. ఏలూరు త్రీటౌన్ స్టేషన్‌లో ఆదివారం గంజాయి కేసుల్లో నిందితులు, గంజాయి తాగేవారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ శివాజీ మాట్లాడుతూ ఏలూరు త్రీటౌన్ పరిధిలో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు, యువతకు గంజాయిని అలవాటు చేస్తూ వ్యాపారం చేసే వ్యక్తులపైనా నిఘా ఉందన్నారు. గంజాయి తాగినా సహించేదిలేదనీ, మీ ప్రవర్తనలో మార్పు రావాలని సీఐ సూచించారు. గంజాయి తాగటం వల్ల యువత తన శక్తిసామర్థ్యాలను కోల్పోతారని, మానసిక వత్తిడితో, గంజాయికు బానిసలుగా మారి భవిష్యత్తు నాశనం అవుతుందని హితవు పలికారు. తమ పిల్లల ప్రవర్తనపై ప్రతి తల్లిదండ్రి పర్యవేక్షణ ఉండాలనీ, కళాశాలలకు వెళ్లే విద్యార్థులను నిత్యం పరిశీలిస్తూ ఉండాలని సీఐ శివాజీ కోరారు.